క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



చేబ్రోలులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఉంగుటూరు: చేబ్రోలులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని శనివారం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్తా బుజ్జి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు ఎంపీటీసీలు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, నాయకులు ఎలిశెట్టి పాపారావు బాబ్జి, కరణం బుజ్జి, దువా కుల లోవరాజు, గేదల వినయరావు, సయ్యద్ షాజహాన్ పాల్గొన్నారు.

కొక్కిరపాడులో జగనన్న భూ హక్కు, భూ రక్ష సర్వే



జగనన్న భూ హక్కు భూరక్ష పథకంలో రీసర్వే చేస్తున్న సర్వేయర్ కోదండరామ్

పెదపాడు: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ కోదండరామ్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో శనివారం రీ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుల భూములకు సంబంధించి రీ సర్వేచేసి ఎలాంటి వివాదాలు లేకుండా ఉండేందుకు పారదర్శకమైన డిజిటల్ రికార్డులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు



అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ.దేవనంద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దెందులూరు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ (రాజమండ్రి) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ.దేవనంద్ శనివారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నత్తానియేల్ అధ్యక్షతన వివిధ అంశాలను విద్యార్థులకు బోధించారు. భవిష్యత్తులో వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. శిక్షణ సమయంలో క్రమశిక్షణ, సత్ప్రవర్తన, నిరంతర సాధన కలిగి ఉండాలన్నారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను ప్రిన్సిపల్ నత్తానియేలు, విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బువ్వనపల్లిలో బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎనికేపల్లి గ్రామానికి చెందిన పిప్పళ్ల పద్మావతికి మంజూరైన రూ.1.30 లక్షల చెక్కును ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాకు సీఎం జగన్ పెద్దపీట వేసి, భారీగా నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్యం ఖర్చులు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందించి బాధితులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జిల్లా సర్పంచ్‌ల చాంబర్ ఉపాధ్యక్షుడు పుప్పాల మెహర్ కుమార్ తదితరులున్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

దెందులూరు: ప్రైవేటు స్కూళ్లలో 1వ తరగతిలో ప్రవేశం, ఉచిత విద్యకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నామని దెందులూరు ఎంఈఓ ఏవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దెందులూరులో మండలంలో 25 శాతం అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల్లోని పేదలకు ప్రైవేటు స్కూళ్లలో 1వ తరగతిలో ప్రవేశానికి ఉత్తర్వులు వచ్చాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్‌కార్డు ద్వారా గ్రామ సచివాలయం, ఎంఈఓ కార్యాలయం, సంబంధిత పాఠశాలల నుంచి మార్చి 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ కోరారు.

వలంటీర్ల సేవలు అమోఘం



ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో పెన్షన్ అందజేస్తున్న అర్థవరం వలంటీరు (ఫైలు)



వలంటీరు జ్యోతికి సేవా మిత్ర అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు (ఫైల్)

- ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ
- పథకాల అమలులో కీలక పాత్ర
- అవార్డుల ప్రదానంతో వలంటీర్లలో మరింత ఉత్సాహం

ఉంగుటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థలతో ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలవడంతోపాటు సకాలంలో ప్రజలకు చేరువ అవుతున్నాయి. వలంటీర్ వ్యవస్థను నేడు దేశానికి ఆదర్శకంగా నిలిచింది. నవరత్నాలతోపాటు అనేక పథకాలు ప్రజలకు అందజేయడంలో కీలకపాత్రం పోషిస్తున్న వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్రాల్లో ప్రవేశపెట్టేందుకు అక్కడి పాలకులు పరిశీలిస్తున్నారు. ప్రజలకు -ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వానికి క్షేత్ర స్థాయి సమాచారం గంటల వ్యవధిలో వలంటీర్ల ద్వారా అందుతోంది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించడంతో సమాచారం సేకరణ, పథకాలకు లబ్ధిదారులను గుర్తించడం తదితర ప్రక్రియలు త్వరితగతిన పూర్తవుతున్నాయి. దీంతో అధికార్లు వేగంగా నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వలంటీర్లకు ప్రతి నెల గౌరవ వేతనంతో పాటు ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు, నగదు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తోంది. ఏలూరు జిల్లాలో 10,286 మంది అవార్డులు అందుకున్నారు. ఇందులో సేవా మిత్ర అవార్డులు 10,098 మంది, సేవా రత్న 155 మంది, సేవా వజ్ర 33 మంది అవార్డులు అందుకున్నారు. ఏలూరు జిల్లాలో 10,286 మంది వలంటీర్లు లక్షలాది మంది లబ్ధిదారులకు సేవలు అందజేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 1,430 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. అవార్డులు అందుకున్న వలంటీర్లు మరింత ఉత్సాహంతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

స్వగ్రామంలో సేవలకు అవకాశం

స్వగ్రామంలో, వార్డుల్లో సేవలు అందించే అవకాశం వలంటీరుకు ప్రభుత్వం కల్పించారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.5వేలు ఇస్తున్నారు. తెల్లవారకుండానే తలుపు తట్టి పెన్షన్ అందజేస్తుంటే వృద్ధులు, ఒంటరి మహిళలు, ప్రత్యేక అవసరాలు గల వారి కళ్లలో కనపడే ఆనందం, వారు చూపే అభిమానం వెలకట్టలేనిదని వలంటీర్లు అంటున్నారు. కొందరు వలంటీర్లు మరింత ముందుకు అడుగువేసి ఇతర సేవలు కూడా అందిస్తూ ఒక కుటుంబ సభ్యుడిగా ఆదరాభిమానాలు పొందుతున్నారు. కరోనా సమయంలో బంధువలే రోగుల సమీపంలోకి రాని పరిస్థితి నెలకొన్న సమయంలో మందులు, నిత్యావసర సరుకులు, ఆహారం తదితర అత్యవసర సేవలు వలంటీర్లు అందించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. 2019 ఆగస్టు నుంచి వలంటీర్ వ్యవస్థ వచ్చిన నాటి నుంచి సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ అర్హులకు చేరవేస్తూ వలంటీర్లు చిత్త శుద్ధితో పనిచేస్తున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో అవార్డు గ్రహీతలు

మండలం	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర
ఉంగుటూరు	462	5	2
భీమడోలు	336	5	1
నిడమర్రు	238	5	-
గణపవరం	360	5	2

చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నాం



గృహిణిగా ఉన్న తనకు వలంటీరు ద్వారా ఎంతో మందికి సేవ చేసే అవకాశం వచ్చింది. అర్హత గల లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నాను. గాంధీ కన్న కలలు సీఎం జగన్ వలంటీరు వ్యవస్థ ద్వారా సాకారం చేస్తున్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పాలన చేరువకావడంతో సమస్యలు వేగవంతంగా పరిష్కారమవుతున్నాయి.

– చంద్రకళ, సేవ మిత్ర అవార్డు గ్రహీత, కొత్త ఉంగుటూరు

వృద్ధుల కళ్లలో ఆనందం తృప్తినిస్తోంది



ఇంటి వద్దకు వెళ్లి వృద్ధులకు పింఛను అందిస్తుంటే వారు వ్యక్తం చేసే ఆనందం మాకెంతో ఉత్సాహాన్నిస్తోంది. నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో సీఎం జగన్ ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇంటికి మా ద్వారా పెన్షన్ పంపించడంతో వారు ఎంతో ఆనందంతో ఉంటున్నారు. సేవా రత్న అవార్డు అందుకున్న నేను చాల తృప్తిగా ఉన్నాను.

– మాధురి, సేవా రత్న అవార్డు గ్రహీత, కైకరం

సేవ చేస్తున్న అనుభూతి వెలకట్టలేనిది



ప్రజలకు సేవలందించడంలో ఉన్న తృప్తి వెలకట్టలేనిది. నేను ఎంబీఏ చదువుకున్నాను. సీఎం జగన్ పిలుపుతో వలంటీర్‌గా చేరి వార్డులో ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందిస్తున్నాను. వృద్ధులు, వితంతవులకు పెన్షన్లు సక్రమంగా అందజేస్తున్నాను. సేవా మిత్ర అవార్డు అందుకోవడం తృప్తినిచ్చింది.

ముకే శివ దుర్గ, సేవ మిత్ర అవార్డు గ్రహీత, ఉంగుటూరు

విద్య, వైద్య రంగాల్లో దాతలు సేవలందించాలి



దెందులూరులో విద్యాదాత ఆకుల నర్సింహారావు సేవలను వివరిస్తున్న నాయకులు

దెందులూరు: దెందులూరు సమీప గ్రామ శివారు ప్రాంతాల్లో పేదరికం కారణంగా విద్యకు దూరంగా ఉన్న, ఆర్థిక సహకారం లేక చదువు ఆపివేసిన, ప్రతిభగల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, ఆర్థిక సహకారం అందించిన ఆకుల ఉమాలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు అధినేత నర్సింహారావు సమాజానికి మార్గదర్శకులని వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, దెందులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శర్మ అన్నారు. శనివారం దెందులూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. హెచ్‌ఎం శర్మ మాట్లాడుతూ తల్లిదండ్రుల బాటలోనే వారి కుమారుడు ఆకుల శ్రీధర్ అమెరికాలో ఆప్తా సంస్థ ద్వారా 2016 నుంచి ఇప్పటి వరకు 130 మంది విద్యార్థులకు రూ.16 లక్షల వరకు స్కాలర్‌షిప్పులు అందించి స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటాద్రి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ నూకరాజు మాట్లాడుతూ దెందులూరు రామాలయాభివృద్ధికి రూ.10 లక్షలు అందజేశారని తెలిపారు. దెందులూరులో ఆకుల నర్సింహారావు కుటుంబం స్ఫూర్తితో గ్రామాల్లో విద్య, వైద్య, ఆధ్యాత్మిక రంగాల్లో దాతలు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం నర్సింహారావు, ఉమాలక్ష్మి దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్య, వైద్యరంగ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నేడు పెదనిండ్రకొలనులో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం



జెడ్పీ నిధులు రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్లు

నిడమర్రు: పెదనిండ్రకొలనులో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాలకు జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొంటారని జెడ్పీటీసీ కోడే కాశి అన్నారు. జిల్లా పరిషత్ నిధులు రూ.30 లక్షలతో రక్షిత మంచినీటి పథకం వద్ద నిర్మించిన మినరల్ వాటర్ మైక్రోఫిల్టర్లను, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను, ఎన్‌ఆర్జీఎస్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని, ఎంపీపీ నిధులు రూ.22 లక్షలతో నిర్మించిన ఎస్సీ ఏరియాలో సీసీ రహదారి, సీసీ డ్రెయిన్స్‌ను, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ సీసీ రహదారి ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. స్వయంభూ శ్రీపార్వతీ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయ ధర్మాదాయ శాఖ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన ఆలయ ఫ్లోరింగ్, రూ.11 లక్షలతో నిర్మించిన రథశాల ప్రహరీ నిర్మాణాన్ని, అదే గ్రామంలో వేణుగోపాల స్వామి దేవస్థానంలో రూ.30 లక్షల నిధులతో నిర్మించిన స్వామివారి నూతన రథం ప్రారంభోత్సవాలు ఉంటాయని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధులు రవి, సుభాష్ తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ భీమడోలు, ఉంగుటూరు మండలాల పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ అనుబంధ విభాగాలు నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తునట్లు మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు తెలిపారు. నారాయణపురం నయారా బంకు వెనుక పొత్తూరి శ్రీనివాసరాజు ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని మంగరావు కోరారు.

అచ్చమ్మ పేరంటాలమ్మకు విశేష పూజలు



విశిష్ట అలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ



నిప్పుల గుండంలోంచి వెళుతున్న పూజారి సతీష్

దెందులూరు: భక్తుల కోర్కెలు తీర్చేకల్పవల్లి గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మపేరంటాలమ్మ ఆలయం వద్ద నిప్పుల గుండం (అగ్నిగుండం) కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. అగ్నిగుండం ప్రవేశం చేసేందుకు భక్తులు వేలాది మంది పోటీపడ్డారు. ఆలయ కమిటీ, పెదవేగి సీఐ కే.శ్రీనివాస్, దెందులూరు ఎస్సై కే స్వామి, సిబ్బంది భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రదక్షిణలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు.

మార్చి 9న అంజుమన్ ఎన్నికలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో ముస్లింలకు విశేష సేవలు అందించే ప్రతిష్టాత్మక సంస్థ అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ పాలకవర్గ ఎన్నికలు నిర్వహించడానికి కమిటీ తీర్మానించిందని ఆ సంస్థ అధ్యక్షుడు ఎండీ సులేమాన్ తెలిపారు. శనివారం స్థానిక అంజుమన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాలక వర్గం పదవీ కాలం ముగిసిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలని భావించినా కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాలేదన్నారు. సంస్థకు అడ్‌హక్ కమిటీని నియమించి నూతనంగా సభ్యులను తీసుకున్నామన్నారు. ప్రస్తుతం సాంకేతిక సమస్యలన్నీ కొలిక్కి రావడంతో ఎన్నికలు నిర్వహించాలని తమ పాలక వర్గం తీర్మానించిందని తెలిపారు. ఎన్నికల కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి చదలవాడ వెంకట రమణా రావు మాట్లాడుతూ అంజుమన్ సంస్థకు ఎన్నికలు నిర్వహించడానికి షెడ్యూల్‌ను రూపొందించామని పేర్కొన్నారు. నగరంలోని 15 జోన్లకు సంబంధించి 35 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి 2,773 మందికి అర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్చి 1, 2 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామని, 3న నామినేషన్ల పరిశీలన, 4న ఉపసంహరణ ప్రక్రియ, 5న పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయిస్తామని తెలిపారు. మార్చి 6 నుంచి 8వ తేదీ వరకూ ప్రచార గడువు ఉంటుందని, 9న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అదే రోజు లెక్కింపు ప్రారంభించి విజేతలను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు ఉప్పులూరి హేమశంకర్, షేక్ ఇబ్రహీం, మహ్మద్ ఇలియాస్, అంజుమన్ పాలకవర్గ సభ్యులు షేక్ అమీర్ జానీ, మహీదుల్లా షరీఫ్, మున్వర్ షరీఫ్, సయ్యద్‌బాజీ, ఎండీ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం, విశ్వాసంతో లక్ష్య సాధన సులభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి విద్యార్థి ఏదో ఒక లక్ష్యం కలిగి ఉండాలని, దానిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని ఏలూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ సూచించారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా చిన్న లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధిస్తే మనలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని, అదే ఆత్మస్థైర్యం, విశ్వాసంతో పెద్ద లక్ష్యాలు సాధించడం సులభతరమవుతుందని స్పష్టం చేశారు. ప్రణాళిక ప్రకారం చదివితే సివిల్స్ అత్యంత సులువుగా సాధించవచ్చన్నారు. 1944లో సాల్ట్‌యాక్ట్‌తో సెంట్రల్ ఎక్సైజ్ యాక్ట్ ఏర్పడిందని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అందించిన సేవలకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ వంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 1944 సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ యాక్ట్ భారతదేశ పరోక్ష పన్నుల చరిత్రలో ముఖ్యమైన మైలురాయి అని, చెల్లాచెదురుగా ఉన్న ఎక్సైజ్ సుంకాలను ఒకే చట్టం కిందకు చేర్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ ఫణి కుమార్, హెచ్‌ఓడీ పీ.అరుణ జ్యోతి, తెలుగు అధ్యాపకురాలు పీ.సౌభాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బీ.లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు



పాతూరులో విద్యా విషయక రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

భీమడోలు: నాడు–నేడు పథకం ద్వారా సర్కారీ బడుల రూపురేఖలు మారాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని భీమడోలు ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులోని ఎంపీపీ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక సందర్శన చేసారు. ఈ సందర్భంగా విద్యా కార్యక్రమాల నిర్వహణ రికార్డులు, రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఎండీఎం రిజిస్టర్, నాడు–నేడు పథకంలో నిధుల వినియోగం, ఫార్మేట్ అసిస్మెంట్-4 పరీక్షను ఆయన పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ముందంజలో ఉండేలా తగు శ్రద్ధ వహించాలని, విద్యాభివృద్ధికి టీచర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



ఉంగుటూరులో సామాజిక తనిఖీలో పాల్గొన్న డ్వామా పీడీ రాము, విజిలెన్సు అధికారులు

ఉంగుటూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో 2022-23లో జరిగిన పనులపై డ్వామా పీడీ ఎ.రాము సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ 2022-23 సంవత్సరానికి రూ.15,54,68,407 విలువైన 2,217 పనులను సంబంధించి డ్వామా పీడీ సోషల్ ఆడిట్, అభ్యంతరాలపై బహిరంగ విచారణ నిర్వహించారు. సమావేశం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ పనుల్లో గుర్తించిన వ్యత్యాసాలను రికవరీ చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.14 వేలు ఫైన్ వేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ విజిలెన్స్ అధికారి ఎ. విజయలక్ష్మి, ఎంపీడీవో శాస్త్రి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు, ఎస్ఆర్‌పి రామచంద్రరావు, ఏపీవో మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చదువు, క్రీడల్లో విద్యార్థులు రాణించాలి



పూళ్లలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం

భీమడోలు: చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు భీమడోలు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు కోరారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల తణుకులో జిల్లా స్థాయి అండర్ 17 విభాగంలో నిర్వహించిన సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అన్నేపు వరుణ్‌వెంకట పవన్‌కుమార్ ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాకారుడిని ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, హెచ్‌ఎం భువనేశ్వరరావు అభినందించారు. శిక్షణనిచ్చిన పీడీ రాహుల్ అభినందించారు. మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలను పాటించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి గది విద్యార్థి దశలో కీలక ఘట్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో అందరి బాధ్యత

ఏలూరు (టూటౌన్): పర్యావరణంలో మార్పుల వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని, పర్యావరణ పరిరక్షణలో అందరూ బాధ్యత వహించాలని దీంతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో శనివారం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నివారణకు మెడికల్ క్యాంపును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి రామగోపాల్ మాట్లాడుతూ పరిశుభ్రమైన జీవితాన్ని అవలంబించడం ద్వారా కొన్ని వ్యాధుల నుంచి బయట పడవచ్చునన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజానికి మెరుగైన సేవలు అందిస్తారని కావున ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. డాక్టర్ వి.భవ్యశ్రీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అనారోగ్యానికి గురైనప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి మెరుగైన వైద్యాన్ని పొందాలని అన్నారు. అనంతరం కోర్టు సిబ్బందికి న్యాయవాదులకు చెవి, ముక్కు,గొంతుకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పెదవేగి : ఓటు హక్కు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతోపాటు, ఇతరులకు అవగాహన కల్పించాలని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధవి తెలిపారు. శనివారం ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ఓటు విలువను ప్రజలకు వివరించామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రోజ్ మేరీ, సిబ్బంది సభాపతి, కారుణ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

భీమడోలు: గుండెపోటుతో తమిళనాడుకు చెందిన ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే తమిళనాడులోని అప్పురుపాలయంకు చెందిన మగేంద్రన్ బాలస్వామి (48) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 9న లారీలో లోడు వేసుకుని చెన్నై నుంచి జంషెడ్‌పూర్‌కు వెళ్లాడు. తిరిగి చెన్నై వస్తుండగా ఈనెల 21న మార్గమధ్యమైన సూరప్పగూడెం వద్ద ఛాతిలో నొప్పిగా ఉందని పక్కనే ఉన్న డ్రైవర్‌కు చెప్పి బాలస్వామి కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న డ్రైవర్ సుందర్‌రాజన్ అదే లారీలో అతన్ని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధాయించారు. మృతుని అన్న సెల్వకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

పెదపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు స్ట్రాంగ్ రూమ్‌ను కౌంటింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులు ఐటీడీఏ పీఓ యం సూర్యతేజ, ఆర్డీవోలు ఎస్ఎస్‌కే ఖాజావలి, భవాని శంకరి, ముక్కంటి అద్దయ్యలు పరిశీలించారు. కలెక్టరు వె ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన రిటర్నింగ్ అధికారులు పెదపాడు మండలంలోని వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుపై సర్వే అధికారులతో చర్చించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు అక్కడ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు. పెదపాడు తహసీల్దార్ భవనారాయణ, సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెదవేగి : రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయికి చెందిన గణమలూరి గౌతమ్ (18) ఈనెల 22న రాత్రి నడిపల్లి నుంచి విజయరాయి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మలుపులో బైక్ అదుపు తప్పి గౌతమ్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు అతన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గౌతమ్ శనివారం మృతి చెందాడు. అతని సోదరుడు గణమలూరి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.